
# సొంత కొంప



కొడవటిగంటి కుటుంబరావు

రాఘవులు ఆ ఇంటిని చిన్నతనంనుంచీ చూస్తున్నాడు కేవలం అందుకైనా ఆ ఇంటిపైన అభిమానం కలగవచ్చు — కాని వాడికా ఇల్లంటే పరమ ద్వేషం. ఆయేటి కాయేడు ఆ ద్వేషం పెరుగుతున్నదేగాని తరగటంలేదు

వాడు పుట్టిననాటికే అది పాతయిల్లు వాడు అందులోనే పుట్టాడనవచ్చు వాళ్లమ్మ పురుడు ఆస్పత్రిలో పోసుకుంది. పదిరోజులైనాక పసిగుడ్డును ఈ ఇంటికే తెచ్చింది ఆ నలుపెక్కిన అడ్డకర్రకే — దాన్ని దూలమని ఎట్లా అనటం — జోలె ఉయ్యాల కట్టి వాణ్ణి ఊపింది ఇప్పుడా అడ్డకర్రే వాడి తలకు బెత్తెడు ఎత్తులో ఉండి తగులుతుందేమో ననిపిస్తుంది. వాడికిప్పుడు పద్దెనిమిదో ఏడు — ఈయేడు ఇంటరు పాసై, ఇంకో రెండేళ్ళు చదివితే గాని "బొత్తిగా అన్యాయం" (బియ్యే) అనే బిరుదు సంపాదించుకోడు.

ఈ దిక్కుమాలిన కొంపలో పద్దెనిమిదేళ్ళు '

అసలది కొంపకాదు ఏ శిలాయుగం నాటి వాళ్ళో నిర్మించుకున్న కుటీరాన్ని మరమ్మతుచేసి ఇంటివాళ్ళు అద్దెకిచ్చి ఉంటారు. ఇంటివాళ్ళకు మంచి ఇల్లు వేరే ఉంది. దాని వెనక తగలడింది ఈ ఇల్లు. దీన్ని ఔట్ హౌస్ అని పిలుస్తారు. ఇది పూర్వ శిలాయుగంవాళ్ళ నివాసం కాని పక్షంలో అసలిల్లు కట్టేటప్పుడు పారలూ, పలుగులూ, బొచ్చెలూ, తట్టలూ, తెల్లటి రంగు పూసిన కర్రలూ, తాపీలూ, తడపలతో తయారుచేసే కుంచెలూ అవీ ఉంచుకునేటందుకు కట్టిన పాక అయినా అయిఉంటుందని రాఘవులు దృఢ నమ్మకం. కేవలం వాళ్ళ నాన్నకు అద్దెకిచ్చే దురుద్దేశంతో వాళ్ళు మట్టి అడుసు గోడలు పెట్టి, పైన సిమెంట్ గిలాబు (పంధొమ్మిది పాళ్ళ

ఇసుకలో ఒకపాలు సిమెంటు అధికరించి) చేసిన గోడలూ, నడిస్తే గుంటలు పడే గచ్చూ చేసి, వేసవికాలం వేడిగా ఉండటానికి రేకులు కప్పి, "బొట్ హౌస్. టు లెట్!" అని ఉంటారు. ఇల్లు మరీ పెద్దదయి పోతుందని ఒక అడ్డగోడ కట్టి ఒక భాగం వంట ఇల్లనీ, రెండో భాగాన్ని పడకటిల్లనీ అన్నారు. ఇంటికి దొంగాడు దూరటానికి వీల్లేనికిటికీలు మూడున్నాయి

ఈ ఇంటో పద్దెనిమిదేళ్ళు! రాధ ఇక్కడే పుట్టింది, శర్మ ఇక్కడే పుట్టాడు ఇవాళ ఈ కొంపలో అయిదుగురు ప్రాణులు. ఇది ఇల్లు కాదు, కారు – కదలని కారు. ఫైవ్ సీటర్ కారు ఇంతకన్న ఆట్టే చిన్నగా ఉండదు. ఈ అయిదు గురిలో ఒక్కరికీ ఇంటిని గురించి నిజమైన సంతృప్తి లేదు

"ఇల్లు చిన్నదంటే చిన్నదే మరి! మనిషికి మనిషంత చోటేగా కావాలి? పగలల్లా పిల్లలు స్కూలుకు పోతారాయె, ఆయన ఆఫీసుకు పోతారాయె. ఇంకా పెద్ద ఇల్లయితే ఒక్కత్తెగా ఉండేదానికి కొంప బావురుమంటూ ఉండదుటండీ?" అని అమ్మ చమత్కరిస్తుంది

శర్మ రాత్రి పొద్దుపోయి ఇంటికొస్తాడు అన్నం తిని ఏ స్నేహితులింటికో వెళ్ళిపోతాడు. వాడింటిదగ్గర పడుకోవటం మానేసి చాలా ఏళ్ళయింది.

"వెధవా, నీ కిది హోటలల్లే ఉందా? తిండికి తప్ప రాకుండా తప్పించుకు తిరుగుతున్నావు." అని తల్లి ఒకనాడు శర్మగాడిమీద లేచింది.

"ఊరుకోవే. వాడుకూడా ఇల్లుపట్టుకు వేళ్ళాడితే మరింత ఇరుకనిపిస్తుందీ!" అన్నాడు నాన్న.

రాధ ఇంటివాళ్ళ కుముదవల్లితో మంచి దోస్తీ చేసింది. ఖాళీ సమయంలో ఇద్దరూ ఇంటివాళ్ళ మేడమీదికి చేరుతారు

"అద్దె ఇవ్వకుండా రాధ మంచిలాటే కొట్టింది," అనేవాడు రాఘవులు

"ఏరా, మీ నాన్న మూడొందలలో నాలుగొందలలో సంపాదిస్తున్నాడు గామాలు. అంతకంటె మంచి కొంప చూసుకోరాదురా?" అని స్నేహితులన్నప్పుడల్లా రాఘవులుకు పుండుమీద కారం చల్లినట్టుండేది

నాన్నకన్న తక్కువ సంపాదనగలవాళ్లు కూడా మంచి భాగాలలో డబ్బు పారేసి అద్దెల కుంటున్నారు.

"యాభై అయిదు రూపాయిలకి మంచి భాగం కాళీగా ఉందట, నాన్నా!" అని రాఘవు లొకసారి అంటే, అది ఎక్కడ ఉందో విచారించి, "యాభై అయిదుతో అయిపోతుందిరా? నేను ఆఫీసుకు రైల్లో పోవటానికి వీలుండదు నువ్వయినా బస్సులోనే పోవాలిసొస్తుంది మన ఖర్చు ఎంత పెరుగుతుందో లెక్కవేసి చూడూ! అసలే ముడిపడకుండా ఉంటే –" అన్నాడు నాన్న.

ఫలానా ప్రాంతంలో భాగం ఉన్న దన్నప్పుడల్లా ఆయన ఇంటి అద్దె పెరుగు తుందన్న విషయం ఆక్షేపించక ఇతర ఖర్చులు పెరుగుతాయని రుజువు చేసే వాడు. తానై ఫలానిచోట ఇల్లున్నదని తన నోటిమీదుగా అనకపోయినా ఇతరు లన్నప్పుడు ఈ పద్ధతి అవలంబించేవాడు.


ఇతరులు చెప్పే ఇళ్ళు రైలుకు దగ్గరగా ఉండాలి, సినిమా థియేటర్లకు దగ్గరగా ఉండరాదు, కిరాణా షాపుల క్కూడా కొంత దూరాన ఉంటేనే మంచిది. కూరల మార్కెట్టుకు దూరం కావటం కూడా మంచిదే.

“ఖర్చంటే ఎంత భయంగా ఉందో తెలుసా ? అసిధారావ్రతం చేస్తున్నా ననుకో — అసిధారా వ్రతం !” అంటా డాయన.

కాని ఇంకో ఇంటికి వెళ్ళవలసిందే నన్న సంగతి ఆయన ఎప్పుడూ కొట్టెయ్య లేదు. అనువుగా దొరికితే ఇంకో ఇంటికి వెళ్ళవలసిందే ననీ ఆయన ఉద్దేశంకూడా.

“మరయితే ఆ ప్రయత్నం చెయ్య వేం ?” అని భార్యగాని పిల్లలుగాని అడిగితే ఆయన మార్చి మార్చి రెండు మూడు రకాల సమాధానాలు చెబుతూ వచ్చాడు.

ఒకటి, తనకు క్షణం తీరటంలేదు. ఏ ఉద్యోగమైనా చెయ్యొచ్చుగాని ప్రెస్ రిపోర్టరు ఉద్యోగం మటుకు చెయ్య



కొత్త పద్ధతి క్యూ !

గూడదు. జూనియర్ రిపోర్టరుగా ఉండ గానే మంచి చాన్సు వచ్చింది. అప్పట్లో రిపోర్టరు ఎలవెన్సు పదిహేను రూపా యలూ పోతుందని దాన్ని జారవిడిచాడు. పొరబాటయింది. ఇప్పుడు తాను సీనియర్ రిపోర్టరయాడు చీఫ్ రిపోర్టరయే చాన్సు కూడా ఉంది. అందుకని మరి గతించిన దానికి విచారించి లాభంలేదు అనాడు తనకు వచ్చిన ఖాళీలో చేరినవాడు ఇవాళ బొంబాయిలో అసిస్టెంటు ఎడిట రైపోయి, ఝామ్మని వెయ్యి రూపాయలు తెచ్చు కుంటున్నాడు. న్యాయంగా తనకు రావలి సిన చాన్సేనూ అనాడు దూరదృష్టి లేక పోయింది, ఉన్నవాడెవడూ సలహా ఇచ్చాడుకూడాకాదు. కాకపోయినా, తానే ఆ చాన్సు తీసుకుంటే తనకా అదృష్టం పట్టేది కాదేమో ! తల రాత ఏమైనా టెలీ ప్రింటర్ క్రీడా — కరెక్షన్ ఇవ్వటానికి ? ఏమిటో !

రెండోరకం ధోరణి — అసలు చూడ వలసింది ఇల్లు మారటం కాదు. ఎక్కడో చవుగ్గా రెండు గ్రౌండ్లు చూసుకుని

కొని పడేస్తే ముందు ఇంత ఇల్లే వేసుకుని ఉంటూ, క్రమంగా ఒక్కొక్క గదే వేయిస్తూ పోవచ్చు రెండొందలు పెడితే మంచి బోట్ హౌస్ లాటిది కట్టవచ్చు. ఇప్పుడిచ్చే ముప్ఫై రూపాయల అద్దె ఆదా అవుతుంది కాదూ? ఏడాదికి అదీ ఇదీ చేర్చి నాలుగొంద లనుకో — ఏడాదికో గది కట్టెయ్యొచ్చు అయిదేళ్ళకల్లా డీసెంట్ హౌస్, వరండా గట్రాతోసహా రెడీ అయిపోయుంటుంది సగంలో "మనం" ఉండిపోయి సగభాగం ఏ ముప్ఫైకో అద్దెకిచ్చినా ఇవ్వొచ్చు అయిదేళ్ళ క్రితం గ్రౌండు నూట పాతిక్కి స్థలం అమ్మకానికి వచ్చింది మాంబళం స్టేషనుకు అటుపక్క - నూరు గజాల దూరంలో. దగ్గిర డబ్బుండికూడా అశ్రద్ధ అయిపోయింది. కొని ఉండవలసినిది పొరపాటై పోయింది "కొనెయ్యవయ్యా. చూస్తావేం?" అని ఎవరు కాస్త అన్నా కొని ఉండేవాడే ఎవరూ అనలేదు. దాన్ని గురించి తెగ వాకబు చేసిన నరసింహమే చిట్టచివరకు, "ఇంకా చవుకగా స్థలాలు దొరుకుతాయంటున్నారండీ!" అని నీళ్ళు నమిలేశాడు. దాంతో ఆ చాన్సుకాస్తా పోయింది చూస్తూండగానే అవే స్థలాలు గ్రౌండు ఆరువందలు — ఏడువందలు — వెయ్యి — పదిహేను వందలు — ఇప్పుడు రెండు వేలు! — పాపం పెరిగినట్టు పెరిగాయి. ఝామ్మని ఇళ్లు కట్టేశారు ఆ చాన్సు కాస్తా పోయింది.

ఇల్లు మారటం గురించి నాన్న అవలంబించే మూడో ధోరణి రాఘవులుకు మరీ చాదస్తంగా కనబడేది. అదేమిటంటే — ఈ ఇల్లు అచ్చొచ్చింది! పిల్లలందరూ ఇక్కడే పుట్టారు ప్రమోషన్లన్నీ ఈ ఇంట్లోనే వచ్చాయి. అరవై రూపాయలతో ఆరంభమైన ఉద్యోగం — ఈ ఇంట్లో ఉండగానే జీతం ఆరింతలు పెరిగింది! చదువులకూ, పెరిగిపోయిన పై ఖర్చుకూ చాలటమే గాకుండా ఇవతల అయిదువేల ఇన్సూరెన్సు పాలిసీ, అవతల ప్రావిడెంటు ఫండూ! వర్తమానం మాట ఏమైనా, భవిష్యత్తు మాబాగా ఉంది ఇంకో నాలుగేళ్లు ఓపిక పడితే అయిదు వేలూ, ప్రాఫిట్సూ చేతికొచ్చేస్తాయి ఈ లోపల రాఘవుడు చదువు పూర్తిచేసి ఓచిన్న ఉద్యోగం సంపాదిస్తాడు వాడికి కట్నంతో పిల్ల వస్తే ఇంక అడిగావూ!

ఈ ధోరణి ఏ ఒక్కరికీ నచ్చేదికాదు ఆ ఇన్సురెన్సు మొత్తం రాధ పెళ్ళికి ఖర్చురాసి ఉంచింది అమ్మ. పిల్లవాడికి కట్నం రావాలని కోరే మనిషి పిల్లకు కట్నం లేకుండా పెళ్ళి చెయ్యాలని చూడటం భావ్యం కాదని అమ్మ అనేమాట కొట్టివెయ్యటానికి వీలులేనిది

రాధకు ప్రత్యేకించి తన పెళ్ళి ఇట్లా జరగాలన్న నిశ్చితాభిప్రాయంలేదు. తనకు కట్నం లేకుండా మొగుడు వచ్చే పక్షంలో రాఘవు లన్నయ్య పెళ్ళికి కట్నం పుచ్చుకోరాదు — అంతే. రాఘవు లన్నయ్య

కట్నం తీసుకునే పక్షంలో తనకూ కట్న మిచ్చే పెళ్ళి చెయ్యాలి' రాధకీ పట్టుదల ఎందుకో ఎవరికీ అర్థం కాలేదు. అన్నతో ఏదోవిధంగా పోటీ పడాలన్న ఉద్దేశం తప్ప ఆ పెల్ల కింకొక ఉద్దేశ మేమీ బహుశా ఉండదు

''నీకు మంచి మొగుడు రావటం ముఖ్యమా, కట్నం తీసుకునే వాడు రావటం ముఖ్యమా ?" అని నాన్న అడిగితే ''అన్నయ్యకు మాత్రం మంచి పిల్ల రావటమే ముఖ్యం కాదా ?'' అనేది రాధ

"మంచి పిల్లతోబాటు కట్నంకూడా వస్తే చేదా ?''

''నన్ను చేసుకునే వాళ్ళకేనా కట్నం చేదు ?''

''ఓసి పిచ్చిదానా ? కొందరు కుర్రాళ్లకి కట్నం తీసుకోరాదనే నియమం ఉంటు న్నది. వాళ్ళు బుద్ధిమంతులు ''

''అయితే మనంకూడా తీసుకోకుండా ఉండాలి.''

"వాళ్ళే ఇస్తామంటా రనుకో వద్దంటామా ?''

"నా కదంతా తెలీదు అన్నయ్య కెలా జరిగితే నాకూ అలాగే జరగాలి ''

పిచ్చిదిలెమ్మనుకుని నాన్న ఆ విషయం వదిలేశాడు.

* * *

ఇంతకీ ఒక్కటీ అనుకున్నట్టుగా జరగ లేదు. ఇన్నురెన్ను డబ్బు రానూవచ్చింది. రాధ పెళ్ళికి అయిపోయిందికూడా

రాఘవులు బియ్యే పాసయి సబెడి టరుగా చేరాడని సంతోషించినంత కాలం పట్టలేదు ప్రెస్ కమిషనూ, వేజ్ బోర్డూ వచ్చిపడ్డాయి. రాఘవులు యూనియన్‌లో చేరి ఆర్భాటం చెయ్యసాగాడు

''నీ కెందుకురా గొడవా? ఈ యూని యన్ వాళ్ళంటే యజమాని కిష్టంలేదు. చేసేదేదో వేజ్‌బోర్డు వాళ్ళే చేస్తార్లే. అవతల కొండంత ప్రభుత్వం ఉండగా మధ్య మనం హైరానా పడటం దేనికీ ?"

''అదేమిటి నాన్నా ? ఆ ప్రభుత్వం మనది కాదూ ? ఈ పత్రికలవాళ్ళ పన్నె కుతంత్రాలన్నీ నీకు మాత్రం తెలీవూ ?"

ఈ కాలంలో ఎవరిమాట ఎవరు వింటారూ ? ఆ సమ్మెలో రాఘవులు పెళ్లి పురోహితుడల్లే తిరిగాడు. చూసిచూసి పత్రికవాళ్ళు తండ్రి కొడుకుల కిద్దరికీ ఉద్వాసన చెప్పేసి రావలిసిన డబ్బు చెక్కు రూపంలో ఇచ్చారు.

రాఘవులు అక్కడ మళ్ళీ పప్పులో కాలేసి ఆ చెక్కు పుచ్చుకోలేదు. అది ట్రిబ్యూనలుకూ, అక్కడినుంచి కోర్టుకూ ఎక్కింది. ఇంకా రెండేళ్ళకు తేలినా తేలి నట్టే నాన్నకు వచ్చిన డబ్బూ, ప్రావి డెంటు ఫండూ కొంచెం కొంచెమే హరిం చుకు పోతున్నది.

సొంత కొంపా ? అడక్కండి. వాళ్లంతా ఆ బోట్ హౌస్‌లోనే ఉంటున్నారు. ఇదే సొంత కొంప ! ఎవరికీ ఉద్యోగాలు లేవేమో ఇల్లు చాలకుండా ఉంటున్నది ★